అడవిపందుల బీభత్సం

- వందల ఎకరాల్లో పంటలు ధ్వంసం
- దరఖాస్తు చేసుకున్నా.. అందని పరిహారం
- ఆందోళనలో అన్నదాతలు

తలమడుగు: రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు రక్షణ లేకుండా పోతుంది. రాత్రి, పగలు పంటను కాపాడుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. మండలం చుట్టూ పెద్ద ఎత్తున అడవులు, కొండలు ఉండడంతో అడవి పందులు చొరబడి పంటలను ధ్వంసం చేస్తున్నాయి. ఎక్కువగా పత్తి, కంది, సోయాబిన్, జొన్న పంటలు సాగు చేస్తున్నారు. రబీలో వేరుశనగ, శనగ, మొక్కజొన్న పంటలు సాగు చేస్తారు. అయితే ఈ పంటలను అడవి పందుల బారి నుంచి కాపాడుకోవడానికి అష్టకష్టాలు పడుతున్నారు. గుంపులుగుంపులుగా పంటపొలాల్లోకి చొరబడి పంటలను నాశనం చేస్తున్నాయి. సమీపంలో మహారాష్ట్ర సరిహద్దు ఉండడంతో అడవి పందుల బెడద ఎక్కువగా ఉంటుంది. మండలంలోని పల్లి, బరంపూర్, దేవాపూర్, తలమడుగు, కుచూలపూర్, కప్పర్దేవి, లింగి, చర్లపల్లి, ఝరి, పునగూడ, రత్నాపూర్, ఉమ్రీ, కోసాయి, పల్సి(బి), పల్సి(బి)తండా గ్రామాల చుట్టూ అటవీ ప్రాంతం ఎక్కువగా ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

అందని పరిహారం..

గతంలో అడవి పందుల బెడదతో పంటలు నష్టపోగా.. దరఖాస్తు చేసుకున్న ఇప్పటి వరకు పరిహారం అందలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో రైతులు చేసేదేం లేక దరఖాస్తు చేసుకోవడం కూడా మానేశారు. ఖరీఫ్ పంటల సాగు పెట్టుబడి కూడా రాక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. పంట నష్టపోయిన రైతులు సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులకు, అటవీశాఖ అధికారుల వద్ద ఫొటోలతో దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటి వరకు ఎలాంటి పరిహారం అందలేదు. ఏళ్లు గడిచినా.. పరిహారం రాకపోవడంతో దరఖాస్తు చేసుకోవడం కూడా మానేశారు. పరిహారం కూడా తక్కువ ఉండడంతో దరఖాస్తు చేసుకునేందుకు రైతులు వెనుకంజ వేస్తున్నారు. రైతుల రాత్రి వేళలో పంట పొలాల్లో ఉండి పంటలను కాపాడుకుంటున్నారు. కొంత మంది రైతులు పంట పొలాల్లో గుడిసెలు వేసుకొని, టపాసులు కాల్చి పంటలను కాపాడుకుంటున్నారు. కొన్ని సమయాల్లో అడవిపందులు రైతులను గాయపరిచిన సందర్భాలు కూడా ఉన్నాయి. పందుల నివారణకు టపాసులు పేల్చడం, పంటల చుట్టూ చీరలు కట్టి పెన్సింగ్ కట్టి అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పరిహారం ఇప్పించాలని రైతులు కోరుతున్నారు.



అడవిపందుల దాడిలో ధ్వంసమైన పత్తి పంట

పరిహారం ఇవ్వాలి



అడవి పందుల వల్ల పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం పెంచి త్వరగా అందేలా చూడాలి. పంట నష్టం వేలల్లో జరిగితే తక్కువ మోతదులో పరిహారం వస్తుంది. అది కూడా ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి.

– బాగిడి భూమయ్య, రైతు, తలమడుగు

దరఖాస్తు చేసుకోవాలి

అడవి పందుల వల్ల నష్టపోయిన రైతులు పంట నష్టపోయిన ఫొటోతో దరఖాస్తు చేసుకోవాలి. అటవీశాఖ అధికారులు, రెవెన్యూ వ్యవసాయ శాఖ అధికారులు వచ్చి పరిశీలించడం జరుగుతుంది. దరఖాస్తులను అటవీశాఖ అధికారులకు సమర్పించాలి. అటవీశాఖ నుంచి పరిహారం రావడం జరుగుతుంది.

– ప్రమోద్‌రెడ్డి, ఏవో

మూణ్నాళ్ల ముచ్చటే..!



నేరడిగొండ మండలంలోని తర్నం గ్రామానికి వెళ్లే రోడ్డు పూర్తిగా కంకరతేలి రాకపోకలకు పనికి రాకుండా పోయింది. మూడేళ్ల క్రితం నిర్మించిన ఈ రోడ్డు 'తారు' మారైంది. దీంతో ఈ రోడ్డు గుండా ప్రయాణించే వాహనదారులు అనేక అవస్థలు పడుతున్నారు. కుప్టి జాతీయ రహదారి నుంచి తర్నం గ్రామం 2 కిలో మీటర్ల దూరంలో ఉంటుంది. మూడేళ్ల క్రితం నిర్మించిన రోడ్డు మూణ్నాళ్ల ముచ్చటగా మారిందని, ప్రస్తుతం ప్రయాణం కొనసాగించలేని దుస్థితి నెలకొందని అటువైపుగా వెళ్లే గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు కష్టాలు తీర్చాలని కోరుతున్నారు. – నేరడిగొండ

క్లుప్తంగా

26న వ్యాసరచన పోటీలు

ఇంద్రవెల్లి: ఈనెల 26న రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని భీం ఆర్మీ ఆధ్వర్యంలో రాజ్యాంగ అంశంపై ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న ఆరో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు భీం ఆర్మీ ఖానాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు పరత్‌వాగ్ సందీప్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

రోడ్డు బాగు చేసుకున్న గ్రామస్తులు



మరమ్మతులు చేస్తున్న గ్రామస్తులు

బోథ్: తమ గ్రామానికి రహదారి సరిగా లేకపోవడంతో గ్రామస్తులంతా కలిసి రహదారిని బాగు చేసుకున్నారు. మండలంలోని నేరేడుపల్లె గ్రామానికి రోడ్డు సరిగా లేదు. నడవడానికి కూడా ఇబ్బంది పడుతున్నారు. తమ పంటలను ఇంటికి కూడా తీసుకెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీంతో గ్రామస్తులంతా కలిసి గురువారం తమ గ్రామానికి వచ్చే రోడ్డును బాగు చేసుకున్నారు. మొరంతో గుంతలు పూడ్చారు.

గ్రంథాలయాధికారుల ఇష్టారాజ్యం



వరండాలో చదువుకుంటున్న అభ్యర్థులు

ఆదిలాబాద్: జిల్లా కేంద్ర గ్రంథాలయ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని పాఠకులు, నిరుద్యోగ అభ్యర్థుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం గ్రంథాలయంలోని ప్రధానమైన స్టడీ హాల్‌కు పని వేళల్లోనే సిబ్బంది తాళం వేసుకొని వెళ్లడంతో పాఠకులు, నిరుద్యోగ అభ్యర్థులు లైబ్రరీ ఆవరణలో చెట్ల కింద, వరండాలో కూర్చుని చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గ్రూప్స్, టెట్ వంటి పోటీ పరీక్షలు త్వరలో జరగనున్న నేపథ్యంలో గ్రంథాలయ అధికారులు సిబ్బంది ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని నిరుద్యోగ అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై కలెక్టర్ రాజర్షి షాకు సైతం గురువారం ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది.

నాణ్యమైన విద్యనందించాలి

నేరడిగొండ: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని చేయాలని ఐటీడీఏ డీడీ జాదవ్ వసంత్‌రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులతో పాటు పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించేలా ఇప్పటి నుంచే చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలని విద్యార్థినులకు సూచించారు. ఆయన వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయులు అశోక్, ఉపాధ్యాయులు ఉన్నారు.

మత్స్యకారులను ఆదుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకోవాలని గంగపుత్ర సంఘం ప్రధాన కార్యదర్శి మేకల అశోక్ కోరారు. గురువారం ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. శివాలయంలో శివుడి విగ్రహానికి అభిషేకం చేశారు. పట్టణంలోని ఖానాపూర్ చెరువులో గుర్రపుడెక్క పెరిగిపోవడంతో మత్స్యకారులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. వంద శాతం సబ్సిడీపై ఇస్తున్న చేప పిల్లలను లక్ష్యానికి అనుగుణంగా చెరువులు, ప్రాజెక్టుల్లో వదలడం లేదన్నారు. జూన్, జూలై మాసాల్లో చేప పిల్లలు వదిలితే అవి పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు భూమన్న, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అధికారి

నార్నూర్: ప్రభుత్వ పాఠశాలలో చదివే నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని మండల ప్రత్యేకాధికారి గంగాధర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీ తెలుగు, ఉర్దూ మీడియం పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం తిన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం విద్యార్థులకు అందుతున్న తీరును పరిశీలించి జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపించాల్సి ఉంటుందన్నారు. గంట గదిని శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జాడి రాజలింగు, తదితరులు ఉన్నారు.

సీఆర్టీ అక్రమాలపై విచారణ జరపాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: చాలా మంది అక్రమంగా సీఆర్టీ ఉద్యోగం పొందారని, సీఆర్టీ అక్రమాలపై విచారణ జరిపించాలని ఏజెన్సీ డీఎస్సీ సాధన సమితి ఆధ్వర్యంలో ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, ఐటీడీఏ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా కమిటీ అధ్యక్షుడు పెందూర్ దీపక్ మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న సీఆర్టీపై అక్రమాలపై విచారణ జరిపించాలన్నారు. 2022– 24 సీఆర్టీలలో ఇప్పటి వరకు ఎంత మందిని భర్తీ చేశారు. అందులో ఆదివాసీ గిరినులు ఎంతమంది ఉన్నారు, గిరిజనేతరులు, ఎంత మంది ఉన్నారో వివరాలు ఇవ్వాలన్నారు. గత 12 సంవత్సరాల నుంచి ఎలాంటి నోటిఫికేషన్లు లేకుండా 2 వేలకు పైగా ఖాళీలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు సుమేశ్, దీపక్ కొచ్చేరా, మధు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామం సుభిక్షంగా ఉండాలని పూజలు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని లక్కారం గ్రామం సుభిక్షంగా ఉండాలని పాడి పంటలతో వర్ధిల్లాలని లక్కారం గ్రామస్తులు దండేపెల్లి మండలంలోని చిన్నయ్య పెద్దయ్య దేవస్థానంలో గురువారం మొక్కు తీర్చుకున్నారు. గ్రామ పెద్దలు సీతగోంది ఆత్రం గంగాధర్‌రావ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు పెద్దయ్య దేవస్థానానికి వెళ్లారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, పాడి పంటలు బాగుండాలని మొక్కుకున్నారు. కార్యక్రమంలో సాదని శివన్న, బొడ్డు రాజన్న, మర్సుకోల తిరుపతి, లింగాగౌడ్, కాల్వ రవి, నర్సయ్య, విజయ్, సత్తన్న, చిన్న గంగన్న, నాగన్న పాల్గొన్నారు.

ముగిసిన సప్తాహం



పల్లకి ఊరేగిస్తున్న భక్తులు

బేల: మండల కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీలోని ఆధ్యాత్మిక గురువు బాజీరావు బాబా ఆలయ ప్రాంగణంలో వారం రోజులుగా చేపట్టిన బాజీరావు బాబా సప్తాహం ముగింపు వేడుకలను గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. బాజీరావు బాబా ప్రధాన శిష్య బృందం ఆలయ ప్రాంగణంలో భగవద్గీత పారాయణం చేపట్టారు. భజన, కీర్తనలను ఆధ్యాత్మిక సంబోధనతో కొనసాగించారు. చివరగా కాలదహీ హండీ చేపట్టి, తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు.

పద్మశాలి రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన సభ్యులు

బోథ్: పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వల్లకాటి రాజ్ కుమార్‌ను బోథ్ పట్టణ పద్మశాలి సంఘం సభ్యులు గురువారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఆదిలాబాద్ జిల్లా పద్మశాలి సంఘం ఎన్నికల గురించి చర్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మెరుగు భోజన్న, గంగుల మల్లేశ్, నగేశ్, తడక పోశెట్టి, తాళ్ల రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిని ప్రారంభించిన ఎమ్మెల్యే

బోథ్: మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గురువారం ప్రారంభించారు. అనంతరం ఎంపీ నగేశ్ ఆసుపత్రి ప్రారంభోత్సవం సందర్భంగా ఆసునపత్రి సందర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ సంధ్యారాణి, సీహెచ్‌సీ ఆసుపత్రి సూపరింటెండెంట్ రవీంద్ర ప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

'మహారాష్ట్రలో బీజేపీ కూటమిదే అధికారం'

ఇచ్చోడ: మహారాష్ట్రలో జరిగిన ఎన్నికలలో బీజేపీ కూటమి అధికారంలోకి రానున్నట్లు మాజీ జెడ్పీటీసీ బీజేపీ సీనియర్ నాయకులు ముస్తాపురే అశోక్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ఫలితాల తర్వాత మహారాష్ట్రలో బీజేపీ ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకరం చేయనున్నట్లు ఆయన తెలిపారు.

పేద కుటుంబానికి చేయూత

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని భీంసరి గ్రామానికి చెందిన ముస్కు ప్రవీణ్ కిడ్నీ సంబంధిత వ్యాధితో ఇటీవల మృతి చెందారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆయన కుటుంబానికి ఆదిలాబాద్ పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి గురువారం వారి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం చేశారు. ఆయన వెంట భీంసరి మాజీ ఎంపీటీసీ బిక్కి గంగాధర్, కుమ్మరి రాజు, అంబదాస్, హన్మాండ్లు, దేవేందర్, నర్సింగ్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఆదిలాబాద్‌టౌన్: మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని హమాలివాడ మెడికల్ ఆఫీసర్ అవినాష్ అన్నారు. గురువారం పట్టణంలోని తాటిగూడ ఉన్నత పాఠశాల విద్యార్థులు, డ్రగ్స్, మత్తు పదార్థాల వలన కలిగే అనార్థాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు క్విజ్, ఉపన్యాస పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాల హెచ్ఎం నారాయణ, కోఆర్డినేటర్ రణిత, ఏఎన్ఎం రమ, జాదవ్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

జీవనోపాధి కల్పించాలి

బజార్‌హత్నూర్: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు జీవనోపాధితో పాటు, నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం అందించాలని ధర్మసమాజ్ మండల అధ్యక్షుడు సర్కిల్ నరేశ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో తహసీల్దార్ శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇల్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇల్లు, రెండెకరాల సాగుభూమి ప్రభుత్వం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రాకేశ్, మహేశ్, అంకుష్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

బేల: మండల కేంద్రంలో మండల టీఎస్‌యూటీఎఫ్ కార్యవర్గాన్ని గురువారం సంఘం జిల్లా ఎన్నికల అధికారి సూర్యకుమార్, ప్రధాన కార్యదర్శి అశోక్, నాయకులు శివ్వన్న సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా సీహెచ్ అశోక్, ప్రధాన కార్యదర్శిగా నాందేవ్, ఉపాధ్యక్షుడిగా జగదీష్, మమత, కోశాధికారి సంతోష్, కార్యదర్శులుగా నరేశ్‌కుమార్, కుశాల్, లక్ష్మణ్, సుజాత, శివాజీ, లతలను ఎన్నుకున్నారు.

పనులు వేగవంతం చేయాలి

ఇచ్చోడ: మండల కేంద్రంలో చేపడుతున్న డబుల్ రోడ్డు నిర్మాణం పనులు వేగంగా పూర్తిచేయాలని సీపీఐ మండల కార్యదర్శి కల్లెపెల్లి గంగయ్య డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత సంవత్సర కాలం నుంచి రోడ్డు నిర్మాణం పనులు కొనసాగుతున్నాయన్నారు. దీంతో మండల ప్రజలతో పాటుగా ఇతర మండలాల నుంచి వచ్చే ప్రజలు ఇబ్బందులకు గురువుతున్నారని అన్నారు. సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని రోడ్డు పనులు వేగవంతంగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

పత్తి పంట పరిశీలన



పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

తలమడుగు: మండల కేంద్రానికి చెందిన రైతు రావుల నిఖిల్‌రెడ్డి పత్తి పంటను ఇటీవల అడవిపందులు ధ్వంసం చేయగా.. గురువారం మండల వ్యవసాయ శాఖ అధికారి ప్రమోద్ రెడ్డి, అటవీశాఖ అధికారులు పరిశీలించారు. ఎన్ని ఎకరాలో పత్తి పంట సాగు చేసారు? ఎంత నష్టం వాటిల్లిందని వివరాలు సేకరించారు. నష్టపోయిన పత్తి పంట విలువ అడిగి తెలుసుకున్నారు. నివేదికను జిల్లా అధికారులకు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈవో, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

'అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు'



దుకాణాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

బోథ్: అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని, భారీగా జరిమానాలు విధిస్తామని డీఎల్‌పీవో ఫణిందర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఎంపీవో జీవన్‌రెడ్డి, ఈవో అంజయ్యలతో కలిసి పర్యటించారు. రోడ్ల పైకి వచ్చిన దుకాణ సముదాయాలను పరిశీలించారు. వెంటనే వాటిని తొలగించాలని అధికారులను ఆదేశించారు. కాలువలపై నిర్మాణాలు చేపట్టవద్దని అన్నారు. ఇప్పటికే రోడ్లపై, కాలువలపై నిర్మాణాలు చేపట్టిన వారికి నోటీసులు జారీ చేయాలన్నారు.

సోయా కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

సిరికొండ: మండల కేంద్రంలో నాఫెడ్ తెలంగాణ రాష్ట్ర మార్క్‌ఫెడ్ వారి ఆధ్వర్యంలో సోయా కొనుగోలు కేంద్రాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులకు ఇబ్బందులు లేకుండా మార్క్‌ఫెడ్ వారు కొనుగోలు కేంద్రం ప్రారంభించడం జరిగిందన్నారు. అనంతరం ఏడుగురికి సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు.

ముదిరాజ్ జెండా ఆవిష్కరణ

ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో ముదిరాజ్ కులస్తుల జెండాను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆవిష్కరించారు. గురువారం ఏర్పాటు చేసిన జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ నారాయణ, పెంటన్న, విజయ్, మల్లారెడ్డి, లక్ష్మణ్, వీరన్న, నర్సింలు, రాములు, మల్లన్న పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

- ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్



బహుమతి అందజేస్తున్న ఎంపీ గోడం నగేశ్

బజార్‌హత్నూర్: క్రీడలో మానసికోల్లాసం కలుగుతుందని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ అన్నారు. గురువారం మండలంలోని జాతర్ల క్రికెట్ మైదానంలో నిర్వహించిన బీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలకు మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు సమయం కేటాయించాలన్నారు. కార్యక్రమంలో రైల్వే బోర్డు డైరెక్టర్ జీవీ రమణ, ప్యాక్స్ చైర్మన్ మేకల వెంకన్న, అప్పారావ్, బీజేపీ మండల అధ్యక్షుడు పోరెడ్డి శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీలు తాటిపల్లి రాజు, కొత్త శంకర్, అల్కె గణేష్, నానం రమణ, సూది నందినర్సయ్య, ఎట్టం రాములు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

నేరడిగొండ: విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని నేరడిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సద్దాం అన్నారు. గురువారం మండలంలోని లఖంపూర్ బాలికల ఆశ్రమోన్నత పాఠశాల, హాస్టల్‌లో వైద్య శిబిరం నిర్వహించారు. 26 మంది విద్యార్థినుల రక్త నమూనాలను సేకరించారు. అనంతరం వైద్యాధికారి మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భోజనం చేసే ముందు, తర్వాత చేతులను శుభ్రం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్ఈవో పవార్ రవీందర్, ప్రధానోపాధ్యాయుడు అశోక్, వార్డెన్ స్వప్న, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్ రెడ్డి, సాయన్న, హాస్టల్ ఏఎన్ఎం పాల్గొన్నారు.

సైన్స్‌పై మక్కువ పెంచుకోవాలి



ప్రశ్న పత్రాలను విడుదల చేస్తున్న ఎంఈవో

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు సైన్స్‌పై మక్కువ పెంచుకోవాలని ఎంఈవో సోమయ్య అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో మండల స్థాయి చెకుముకి టాలెంట్ ప్రశ్నపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ మండల స్థాయిలో విజయం సాధించి జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించాలని సూచించారు. మూఢ నమ్మకాలను పారద్రోలాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాలల అధ్యక్షుడు రంగినేని పవన్ రావ్, జన విజ్ఞాన వేదిక అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉమాకాంత్, పెంటపర్తి ఊశన్న, లిటిల్ ఫ్లవర్ పాఠశాల ప్రిన్సిపాల్ దేవేందర్ పటాస్కర్, గంగన్న, లింగన్న, లింగరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక జిల్లా నిర్వాహకులు భైరి సతీష్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం చెకుముకి పోటీలు నిర్వహించారు. పాఠశాల స్థాయిలో ఇప్పటికే నిర్వహించిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు మండలస్థాయిలో నిర్వహించిన పోటీల్లో పాల్గొన్నారు. పలువురు విద్యార్థినులు ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయి చెకుముకి పోటీలకు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఈనెల 28న జరిగే పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భైరి సతీష్, ప్రధానోపాధ్యాయులు నరేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

నేరడిగొండ: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కుమారి జెడ్పీఎస్ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్ రెడ్డి అన్నారు. ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా గురువారం పాఠశాలలో డ్రగ్స్ రహిత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, యువత ఇటీవల కాలంలో చెడు వ్యసనాల బారిన పడి విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. గంజాయి, ఇతర డ్రగ్స్‌కు అలవాటు పడడంతో భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. మాదకద్రవ్యాలతో కలిగే నష్టాలు, పర్యావసనాల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో నేరడిగొండ పీహెచ్‌సీ హెచ్ఈవో పవార్ రవీందర్, హెల్త్ అసిస్టెంట్ సాయన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.